# అమ్మ స్నేహితుడు

-యస్.శ్రీదేవి

ఏలూరు నుంచి ఉత్తరాలు వస్తుంటాయి రామచంద్రానికి. ఏలూరుకి హేలాపురి అని పాత పేరు. అందుకే ఉత్తరాలు అలవోగ్గానూ, హేలగానూ వస్తుంటాయంటుంది రామచంద్రం భార్య వకుళ. నిర్మల రాస్తుంటుంది వాటిని. నిజంగానే అంత హేలగానూ ఉంటాయవి.

“బావా! నాకు రెండురోజులనుంచీ జ్వరం. మంచం దిగడంలేదు. నువ్వోసారి రా” అనో... “బావా! ఒక్కదాన్నీ ఉండలేకపోతున్నాను. చచ్చిపోవాలనిపిస్తోంది” అనో రాస్తుంది.

అవి చూడగానే రామచంద్రం ఆగమేఘాల మీద వెళ్లిపోతాడు. రెక్కలు కట్టుకుని వాలిపోతాడు ఏలూరులో. వరంగల్‌కి ఏలూరేం తక్కువ దూరం లోలేదు. కనీసం ఆరేడు గంటల ప్రయాణం. అయినా వెళ్లిపోతాడు. ఖర్చుకీ చూడడు. లోకనిందకీ భయపడడు. అందుకే వళ్లుమంట వకుళకి.

నిర్మల రామచంద్రం మేనమామ కూతురు. మొదట వాళ్లిద్దరికీ పెళ్లనుకున్నారు. ముహూర్తాలు కూడా పెట్టుకున్నారు. పెళ్లికూతుర్ని చేయనిచ్చి ఆ నగలతో ఇంట్లోంచి పారిపోయింది నిర్మల. ఎవర్తో వెళ్లిపోయిందో ఎవరికీ తెలీదు. చాలాచోట్ల వెతికించారు రామచంద్రం మేనమామ. ఎక్కడా దొరకలేదు. అదే ముహూర్తానికి రామచంద్రం వకుళని చేసుకున్నాడు. వాస్తవంగా చెప్పాలంటే రామచంద్రానికి నిర్మలంటే చాలా ఇష్టం.

ఆమె చేసిన పని తనకి అవమానమే అయినా ఆమెని ద్వేషించలేకపోయాడు. పెళ్లయ్యాక కూడా ఆమెని మర్చిపోలేదు. ఎక్కడున్నా ఎవర్ని చేసుకున్నా సుఖంగా ఉండాలని కోరుకున్నాడు.

ఆమె గురించిన అనేక వార్తలు అతని చెవిన పడ్డాయి. అదుగదుగో నిర్మల...రాజమండ్రిలో ఎవర్తోనో కనిపించిందని ఒకరన్నారు. బెజవాడలో కనిపించిందని ఇంకొకరన్నారు. రామచంద్రం మేనమామ మాత్రం ‘అది నా కూతురు కాదు. నాకసలు కూతురే పుట్టలేదు’ అనేసాడు. రామచంద్రం అలా వదిలిపెట్టలేకపోయాడు. వెళ్లి చూసి నిర్మల కాదని నిర్ధారించుకుని వచ్చేవాడు. ఆఖరికి అతనికి ఏలూరులో ఒక మామిడితాండ్ర వాళ్లింట్లో తాండ్ర పని చేస్తూ కనిపించింది.

“ఏమిటే ఇది? నువ్వేమిటిక్కడ?” బాధపడుతూ అడిగాడు.

ఏడ్చింది నిర్మల. ఆమెను తీసుకెళ్లినవాడు గుళ్లో పెళ్లి చేసుకున్నాడట. నగలన్నీ అమ్ముకుని డబ్బు చేసాడుట. ఆ డబ్బు అయ్యేదాకా ఉండి తరువాత పారిపోయాడట. అక్కడా ఇక్కడా చిన్న చిన్న పనులు చేసుకుంటూ బతుకుతోందిట.

“వచ్చేయకపోయావా ఇంటికి?” అడిగాడు రామచంద్రం.

“అమ్మో...నాన్న చంపేస్తాడు” భయపడిందామె.

“సరే. నేను మామయ్యకి నచ్చచెప్తానుగానీ నువ్విలా అక్కడా ఇక్కడా పనులకి తిరగకు. నీకు కావాల్సిన ఏర్పాట్లు నేను చేస్తాను” అని ఇల్లు అద్దెకు తీసుకుందామని ప్రయత్నిస్తే ఎవరూ ఇవ్వలేదు. అలా కాదని లక్షకి తనే ఒక పాత ఇల్లు ఏర్పాటు చేసి దాన్ని చిన్నగా రిపేర్లు చేయించి అందులో ఉంచాడు. అది మొదలు వరంగల్‌కీ, ఏలూరుకీ మధ్య వారధి ఏర్పడడానికి. అప్పటికి రామచంద్రానికి ఒక కూతురు. ఆ పిల్ల పేరు చంటీ. ఎనిమిదేళ్లది.

“వాళ్ల పిల్ల వాళ్లిష్టం. పెట్టుకుంటారు, కొట్టుకుంటారు. మధ్యలో మీకేంటి? వాళ్లకి చెప్పేసి చేతులు దులుపుకోండి” అంది వకుళ.

రామచంద్రం మేనమామ గుండెజబ్బు మనిషి. పైకి ఎంత బింకంగా ఉన్నా లోలోపల కూతురి దిగులు ఆయన్ని తినేస్తోంది. పైకి కనిపించే స్వభావాన్నే చూస్తున్నాడు రామచంద్రం. విషయం ఆయనకి చెప్తే తట్టుకోగలడా అని భయపడుతున్నాడు. అతని మనసులో ఇంకేదైనా కోరిక ఉందేమో! తల్లిదండ్రులకి నిర్మల ఒక్కర్తే కూతురు. బోల్డంత ఆస్తి. అదీగాక నిర్మల చాలా అందంగా ఉంటుంది. ప్రలోభపడుతున్నాడేమో!

ఇంతచేసి, ఇన్నిసార్లు వెళ్లొచ్చాక ఇంకా వాళ్ల మధ్య ఎలాంటి సంబంధం ఏర్పడకుండా ఉంటుందా? అనేక అనుమానాలు తినేస్తున్నాయి వకుళని. రామచంద్రం ప్రవర్తన చూసి ఏదీ అనుకోలేకపోతోంది. నిర్ధారణగా తెలీకుండా ఏమని దెబ్బలాడుతుంది? నీ ఆలోచనల్లో తప్పు ఉందని అనిపిస్తే? ఎలాగా తను బైటపడిందని తెగబడేస్తే?

ఇప్పుడు లేటెస్టుగా మరో ఉత్తరం...అనారోగ్యంగా ఉంది రమ్మని. వెళ్లడానికి అతను తయారైపోయాడు.

“చంటిని కూడా మీవెంట తీసుకెళ్లండి” అంది వకుళ. అతన్ని తనెలాగూ ఆపలేదు. కనీసం నిఘాయేనా ఉంచాలని. తప్పని తెలుసు. కానీ తప్పదు.

“అదెందుకే నాకు తోకలాగా” అన్నాడు మొదట. తరువాత కూతుర్ని తనవెంట పంపించడంలోని భార్య ఉద్దేశ్యం అర్దమై కూతుర్ని తీసుకెళ్లాడు.

“నువ్వు వాళ్ల మధ్యలోకి పోవద్దు. రెండు విషయాలు గమనించి చెప్పు నాకు. పిన్నికి నాన్న కొత్త చీరేనా, పువ్వులేనా కొన్నారా చూడు” డ్యూటీ అప్పజెప్పింది వకుళ తన నిఘా బంటుకి. చంటీ తలూపింది. “నేనిలా అడిగానని నాన్నకి చెప్పకూడదు” అని హెచ్చరించింది. చంటీ దానికీ తలూపింది.

నాన్నకి ఇలా ఉత్తరాలు రావడం, అవి రాగానే ఆయన ఏలూరు వెళ్లడం, ఆయనలా గడప దాటగానే అమ్మ ఏడుస్తూ అన్నమేనా తినకుండా ఉండిపోవడం...ఆ పిల్ల చిన్ని హృదయాన్ని గాయపరుస్తున్నాయి.

★★★

పొద్దునే ఇంత పెరుగన్నం తిని రైలెక్కారు తండ్రీ కూతుళ్ళు. ఒంటిగంటన్నరకి విజయవాడ. అక్కడ నుంచీ రెండుగంటల ప్రయాణం ఏలూరుకి. దారి పొడవునా పల్లీలు, బఠాణీలు, జామకాయలు, అరటిపళ్ళు...ఇలా ఏవొస్తే అవి కొనిపెట్టాడు రామచంద్రం కూతురికి. ఏలూర్లో దిగారు. రైల్వేస్టేషన్ తుడిచిన అద్దంలా ఉంది.

"ఆకలేస్తోందా చంటీ?" దిగగానే అడిగాడు.

చంటి తలూపింది.

"ఇక్కడ ఇడ్లీలు బాగుంటాయి. తిందాం రా" అని ఒక హోటలుకి తీసుకెళ్లాడు. ఇడ్లీ తిన్నాక "ఇంకా ఆకలేస్తోంది" అంది చంటి. అతను నవ్వి దోశ కూడా తినిపించాడు. పాలు కూడా తాగించాడు. అక్కడ నిర్మల తిండి తిని ఎన్ని రోజులైందో! రెండు ఇడ్లీలు తనకి కూడా కట్టించాడు.

"మనం ఇక్కడికి వచ్చేసామా నాన్నా, అమ్మ అన్నం కూడా తినదు" కళ్లల్లో నీళ్ళు తిరుగుతుండగా అంది చంటి. అతనికెక్కడో చురుక్కుమంది. కానీ బైటపడలేదు. ఏమీ లేదంటున్నా ఎందుకీ వకుళకి పంతం? కోపం కూడా వచ్చింది. దాన్ని లోపలే దాచుకున్నాడు. ఆటో మాట్లాడుకుని ఇంటికెళ్లారు. వెళ్లేసరికి మంచంలో నీరసంగా పడుకుని ఉంది నిర్మల. నాలుగురోజులనుంచీ జ్వరం, తలనొప్పి, వాంతులూనట. కళ్లల్లో ఉన్నాయి ప్రాణాలు.

"డాక్టర్‌కి చూపించుకున్నావా?" ఆత్రుతగా అడిగాడు. చూపించుకున్నాన్నట్లు తలూపింది. రామచంద్రం వెనుకనున్న చంటిమీద పడింది దృష్టి. "నీ కూతురా?" అడిగింది. చేయి పట్టి దగ్గరకు తీసుకుని పక్కన కూర్చోబెట్టుకుంది. చంటికి బెరుగ్గా ఉంది.

"మందులేం రాసాడు? తెప్పించుకున్నావా? ఎవరు తెచ్చారు?" ఇత్యాది ప్రశ్నలడిగి అక్కడే టేబుల్ మీద ఉన్న మందులని పట్టి పట్టి చూసాడు.

"తిన్నావా ఏమైనా?" అనుమానం వచ్చింది.

"అందుకే మేం తింటూ నీక్కూడా ఇడ్లీలు పేక్ చేయించి తీసుకొచ్చాను" అని ఇడ్లీ పేకెట్లు తీసాడు.

"ఎంత ప్రేమ బావా నీకు?" కళ్లల్లో నీళ్ళు తిరిగాయి నిర్మలకి.

"ఛ...ఏమిటిది నిర్మలా? మేనత్త మేనమామ పిల్లలకు ప్రేమలుండవా? ఐనా ఇందులో నేను చేసినదేముంది? చాతకాని మనిషికి రెండు ఇడ్లీలు తేవడం కూడా గొప్ప పనే?" మందలించి కళ్ళు తుడిచాడు.

ఆమె లేవలేకపోతుంటే తనే భుజాలు పట్టి లేవదీసి తన వళ్లో ఆమె తల ఉంచుకున్నాడు. నుదుటి మీద, చెంపలమీద పడుతున్న వెంట్రుకలను వేలి కొనలతో సర్ది ఇడ్లీల పేకెట్టు తీసి చిన్న చిన్న ముక్కలు తుంపి తినిపించసాగాడు.

'నాన్న పిన్నికి కొత్త చీర కొనలేదు, పువ్వులు కొనలేదు. వాళ్లిద్దరి మధ్యకీ వెళ్లవద్దని కూడా అమ్మ చెప్పింది. ఇవన్నీ చూడమని చెప్పలేదు. కానీ ఎలా?' చంటికి కుతకుత ఉడికిపోతోంది.

"నాన్నా" అంది నెమ్మదిగా.


"ఏంటమ్మా...చూడు పిన్నికి ఎక్కిళ్లొస్తున్నాయి. వెళ్లి గ్లాసుతో మంచినీళ్లు తీసుకురా" అన్నాడు తను చేస్తున్న పనిమీదే దృష్టి నిలిపి.

చంటి మంచినీళ్ళు తెచ్చిచ్చింది.

"నాన్నా...అమ్మకి కూడా ఒక మంచి స్నేహితుడున్నాడు" అంది.

రామచంద్రం దిగ్గున తలెత్తాడు. నిర్మల కూడా తెల్లబోయింది.


"నువ్వు ఊళ్లో లేనప్పుడు జ్వరం వస్తే అచ్చం ఇలాగే ఇడ్లీలు తెచ్చిచ్చాడు. అచ్చం ఇలాగే వళ్లో పడుకోబెట్టుకుని తినిపించాడు. అచ్చం ఇలాగే మంచినీళ్ళు తాగించాడు. అచ్చం ఇలాగే..." ఏడుపుతో గొంతు పూడుకుపోయింది. గౌను అంచుతో కళ్ళు తుడుచుకుంది.



రామచంద్రం కళ్ళు ఎరుపెక్కాయి.


"పోనీ బావా చిన్నపిల్ల...తెలీక ఏదో అంటోంది'' సర్దిచెప్పబోయింది నిర్మల. అతని కళ్లల్లో ఇంకా ఎరుపు జీరే.

"ఎలా నిర్మలా! ఇలా దిగులుతో అనారోగ్యం తెచ్చుకుంటుంటే? ఇంకా అప్పటి చిన్నతనాలు వదలకపోతే ఎలా కుదురుతుంది? రా బావా అని ఒక్క ఉత్తరం ముక్క రాసి పడేస్తావు. రానా రాక మాననా? ఇలా కాదుగానీ మీనా న్నతో మాట్లాడతాను. ఆయన కాదంటే అప్పుడు ఆలోచిద్దాం'' కోపంగా దెబ్బ లాడాడు. అతనికంత సడెన్‌గా ఎందుకలా కోపం వచ్చిందో చంటికి తెలుసు. నిర్మలకి తెలీదు. చంటి మాటలకి కోపం వచ్చిందనుకుంటోంది. ఈ పిల్ల ఇంత తెలివితక్కువదేమిటి? అనుకుంది. ఎప్పుడూ రెండుమూడు రోజులుండే రామ చంద్రం ఈసారి ఏలూరులో ఆ రాత్రి ట్రైన్‌కే తిరుగు ప్రయాణమయ్యాడు. వచ్చేటప్పుడు చంటికి అన్నీ కొనిచ్చాడా... ఇప్పుడు ఏటికొప్పాక బొమ్మలు కనబడ్డే కూడా కొనలేదు. చంటి అడిగితే "నోరు మూసుకో'' అని కసురుకు న్నాడు కూడా.



## హుందాగా ఉంటా!

తేజాబ్‌తో హిట్ కొట్టిన కరిష్మాకపూర్ పెళ్లికి ముందు ఎంతో బిజీగా ఉన్నా ప్రస్తుతం అమ్మాయి పెంపకంపైనే శ్రద్ధ చూపిస్తే మంచి అమ్మగా మారిపోయింది. చెల్లితో సరదా కబుర్లు చెప్పడం, ఇష్టమైన మహారాష్ట్రి యన్ డిషెస్ తినడం, ఛీజ్‌లు ఆరగించడం ఆమెకెంతో ఇష్టంట. తేజాబ్ లాంటి చిత్రాలు మరిన్ని రావాలని కోరుకునే కరిష్మా హుందాగా ఉండడా నికి ప్రాధాన్యత ఇస్తుంటుంది.




***

తిరుగు రైల్లోనే ఇంటికొచ్చిన భర్తని ఆశ్చర్యంగా చూసింది వకుళ. చంటిని వెంట పంపడంచేతే ఇలా వచ్చారనుకుంది. నిర్మలకి ఏమైందనిగానీ, ఎలా ఉందనిగానీ అడగలేదు. దానికి తగ్గట్టే అతను కూడా మాట్లాడలేదు. వస్తే నాకు రావాలిగానీ కోపం అతనికి బెట్టేమిటి? అనుకుని తను కూడా ఉదాసీనంగానే ఉండిపోయింది. రెండురోజులు అలాగే గడిచాయి.

"ఏం జరిగిందే అక్కడ?'' అని చంటిని అడగాలంటే మనసొప్పలేదు.

'పిన్నికి నాన్న చీరగానీ, పువ్వులుగానీ కొనలేదు'' అని చెప్పేసిన్దీ కూడా. ఇంకేం అడుగుతుంది అంత చిన్నపిల్లని? చేజేతులా లేనిపోని ఆసక్తి సృష్టించి చెడగొట్టడం కాకపోతే' అని వూరుకుంది.

ఆఖరికి రామచంద్రమే బైటపడి అడిగేసాడు.

"ఎవరే నీకంత స్నేహితుడు? నేను ఊళ్లో లేనప్పుడు మనింటికొచ్చి నిన్ను ఒళ్ళో పడుకోబెట్టుకుని ఇడ్లీలు తినిపించి చంటి చేత మంచినీళ్ళు తెప్పించి నీకు తాగించేవాడు? ఈ మంచం మీదేనా అన్నీనూ'' అతని కళ్లల్లో ఆగ్రహం.

ఒక్కక్షణం వకుళకేమీ అర్థంకాలేదు. అర్థం చేసుకుని చిన్న నవ్వు నవ్వడా నికి కొద్ది క్షణాలు పట్టింది. ఆ చిరునవ్వు క్రమంగా పెరిగి పెద్దదైంది.

"ఆ పనులన్నీ అక్కడ చంటి ఎదురుగా మీరు చేసారా?'' అని అడిగింది. కళ్లతో చూసినట్లు అంత ఖచ్చితంగా లా అడుగుతోందో అర్థంకాలేదు. అతను ఏమీ జవాబివ్వలేదు. తనకి మాత్రం జవాబు కావాల్సిందేనన్నట్లుగా చూసాడు.

"మీ చిన్నప్పుడు పక్కింటి పిల్లాడు నిమ్మకాయంత బంతి తీసుకొచ్చి దాన్ని చూపించి వూరిస్తుంటే మీరనలేదూ...చేతులు బారెడంత చాపి మా నాన్న ఇంత పే...ద్ద బంతి తెస్తాడని?'' గలగలా నవ్వేసింది.

అతను విభ్రాంతిగా చూసాడు. చంటి చిన్నపిల్ల...తల్లిపట్ల ఎంత పొసెసివ్ నెస్. తను నిర్మలని దగ్గరకు తీసుకున్నాడని ఎంత కథ అల్లేసింది? తన గుండెని గాలమేసి పట్టేసింది. ఈ అంతటి వెనకా అసూయ నాన్న ప్రేమ తనకీ అమ్మకే స్వంతం కావాలన్న ఆకాంక్ష. తను ఏలూరు రైలెక్కినప్పటినుంచీ వకుళ ఏడుస్తూనే ఉంటుందట. అన్నం కూడా తినదట. ఈ ఇద్దరూ తనవాళ్ళు కాబట్టి తనకోసం తన ప్రేమ వాళ్లకే పరిమితం కావాలని తపిస్తున్నారు. తనకీ అసూయే. వకుళ జీవితంలో తను తప్ప ఇంకెవరూ ఉండకూడదని. ఇందులో తప్పు లేనప్పుడు వాళ్లలా అనుకోవడంలోనూ తప్పులేదు.

నిర్మల తనకేమవుతుందని? తనని కాదని వెళ్లిపోయింది. జీవితంలో ఓడి పోయింది. తనని ఆసరా చేసుకుని బతుకుతోంది. వకుళనీ, చంటినీ ఇంత బాధపెడుతూ తనెందుకు సాయం చేయాలి? నిర్మలపట్ల తనకింకా ఆంక్షలు న్నాయా? తనని కాదని వెళ్లిపోయినా ఇంత ఔదార్యంగా ఉంటున్నాననే తృప్తి కోసమా? ఆత్మవిమర్శ మొదలైంది అతనిలో. కర్తవ్యం అర్థమయింది. మేన మామ ఇంటికి వెళ్లాడు. ఆయన లేడు. అత్త ఉంది. ఆవిడకి చెప్పాడు నిర్మల సంగతి. "ఏలూరులో ఉందిట కదా?'' మామూలుగా అడిగిందావిడ.

"మీకు తెలుసా?'' ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు.

"ఇలాంటివి తెలియకుండా ఉంటాయా? మా బంధువులెవరికో కనిపిం చిందిట. ఇంటికి రమ్మని కబురుచేసాం. వస్తే ఏదో ఒక దారి చూపిస్తామన్నాం. కన్నాక మాకు తప్పదుకదా?'' అందావిడ. తనతో ఇవేవీ చెప్పలేదు నిర్మల. తనక్కడికి వెళ్తున్నట్లు వీళ్లకి తెలుసా? అంటే? నిర్మల...తన జీవితంలోకి పునః ప్రవేశించాలనుకుంటోందా? ఎంత అసంబద్ధమైన జీవితంలో ఇరుక్కుపోయే వాడు తను ఇంకొద్ది రోజులు ఈ బంధం ఇలాగే కొనసాగి ఉంటే? ఇవన్నీ ఊహించిందా వకుళ? అతనికి తల తిరిగిపోయింది.

ఇంటికి వచ్చేసాడు. చంటి ఎదురొచ్చింది. దొంగ చూపులు చూసింది. ఎత్తుకుని రెండు బుగ్గలమీదా గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు.

★